

కథ

స్వర్ణశైలజ

# బుచ్చిబాబు బుల్లి సమస్య

"ఏవండీ! మీరు అర్జెంటుగా సూపర్ మార్కెట్‌కి వెళ్లి నాలుగు కేజీల మైదా, రెండు డజన్లు ఎగ్స్, నాలుగు కేజీల వెన్న, అయిదు కేజీల డాల్డా, పది కేజీల పంచదార, కేజీ జీడిపప్పు, అరకేజీ కిస్మిస్, అరకేజీ బాదాములు...ఆ...ఇంకా... యాలకులు పావు కేజీ...అయ్యో! ఇంకో రెండు గుర్తుకు రావడం లేదు. పోన్లెండి. ముందు ఈ లిస్టులోని సామాన్లు తీసుకుని రండి. మిగిలినవి రేపు తెచ్చుకోవచ్చు"

రెండు పెద్దపెద్ద సంచుల్ని చేతికందిస్తూ చెప్పింది కాంతం. భార్య చెప్పిన వాటికి ఇంచుమించుగా ఎంత ఖర్చు అవుతుందో మనస్సులోనే లెక్కలు వేశాడు. ఒక్కసారి గుండెగుభేల్‌మన్నది.

"కాంతం! నువ్వు చదివిన లిస్టు అంతా మనకేనా లేకపోతే మన చుట్టుపక్కల నాలుగిళ్లవారికీ కలిపి చెబుతున్నావా?"

కాస్తంత ఆశ, బోల్డంత అనుమానం కలిపి నీర్సంగా అడిగాడు.

'ఎంత అమాయకులండీ మీరు' అన్నట్లు బుచ్చిబాబు వైపు జాలిగా చూస్తూ "ఊరందరికీ సరుకులు నేనెందుకు సప్లై చేస్తాను? అంత వెర్రివెంగళప్పలా కన పడుతున్నానా మీకు? ఈ కాంతం ఏ పని చేసినా దాని కొక అర్థం పరమార్థం ఉంటాయి. ఇప్పుడు చెప్పిన లిస్టు అంతా మన కోసమే. పండుగ వస్తోంది కదా! రకరకాల వంటలు చెయ్యాలి" ఉత్సాహంగా అంది కాంతం.

గతుక్కుమన్నాడు బుచ్చిబాబు. 'ఈ పిచ్చిమొహం రోజూ టీవీ చూస్తూ నాకు టిఫిన్, కాఫీలు ఇవ్వడం మర చిపోయేది. కానీ ఇప్పుడేంటి ఏకంగా నెలల పేర్లు, పండుగలే మర్చిపోతోంది. కొంపదీసి దీనికి 'షార్ట్ టైమ్ మెమొరీ లాస్' లాంటి సినిమా జబ్బులు ఏవైనా వచ్చేశాయా? పాపం'

"కాంతం ఇది జనవరి కాదు డిసెంబరు. పండక్కి ఇంకా నెల రోజులకు పైగా టైమ్ ఉంది. ఇప్పటి నుంచే అన్ని సరుకులూ కొని, ఇంట్లో పెట్టుకోవడం ఎందుకు? ఎంచక్కా వచ్చే నెల వెళ్లి అన్నీ కొని తెచ్చుకుందాము"

కాంతం కిసుక్కున నవ్వింది. తన పొడవైన జడని వయ్యారంగా చేత్తో తిప్పుతూ "నేను చెప్పింది సంక్రాంతి గురించి కాదు క్రిస్మస్ గురించి"

బుచ్చిబాబు అయోమయంగా చూశాడు. "అదేంటి మనం క్రిస్మస్ ఎందుకు చేసుకుంటాం? మనం క్రిస్టియన్స్ కాదు కదా!"

"ఈ సంవత్సరం నుంచి మనం కూడా చేసుకుందాం"

"కొంపదీసి నాకు తెలియకుండా నువ్వుగానీ మతం మార్చుకున్నావా? ఇకమీదట మన పండుగలు ఏమీ చెయ్యవా" ఆశ్చర్యంగా అడిగాడు.

"అయ్యో! పిచ్చిశ్రీవారు! మన పండుగలు ఎందుకు చేసుకోము సుబ్బరంగా చేసుకుందాము. అయితే ఇకమీదట మనం 'ఈద్', 'గుడ్‌ఫ్రైడే', 'క్రిస్మస్', 'ఓణమ్'... ఇలా సంవత్సరంలో వచ్చే పండుగలన్నీ చేసుకుందాం. రకరకాల పిండివంటలు కూడా ఎంచక్కా వండుకుని తిందాం"

బుచ్చిబాబు కంటిరెప్ప వెయ్యకుండా నోరు తెరచుకుని బిత్తరచూపులు చూస్తున్నాడు. కాంతంకి నవ్వు ఆగడం లేదు. ఒక చేత్తో గట్టిగా కడుపు పట్టుకుని...

"అబ్బా! ఏంటా ఎక్స్‌ప్రెషన్స్. నవ్వలేక చస్తున్నాను. ఇంక మిమ్మల్ని సస్పెన్స్‌లో ఉంచనులెండి. ప్రస్తుతం మన దేశంలో తరచుగా బాంబ్‌బ్లాస్టులు అవుతున్నాయా? కులాల, మతాల పేరుతో హత్యలు, దోపిడీలు జరుగుతున్నాయా?"

దేశంలోని గొడవలకీ... కాంతం పండుగలకీ ఏమిటి సంబంధమో బుచ్చిబాబుకి అర్థం కాలేదు. అయినా కాంతం ప్రశ్నలకి 'అవును' అన్నట్లు తల ఊపాడు.

కాంతం ఉత్సాహంగా వంటగదిలోకి వెళ్లి చల్లటి షర్బత్ కలిపి తీసుకుని వచ్చి బుచ్చిబాబు చేతిలో పెట్టి, తన ఉపన్యాసం మొదలుపెట్టింది.

"మన దేశంలో ఎన్నో మతాల వారున్నారు... కులాల వారున్నారు. అయితే అందరూ కలసి బ్రతకడానికి స్నేహభావంతో ఒకరితో ఒకరు ప్రేమగా ఉండడానికీ మధ్య ఎంతో తేడా ఉంది. దేశంలోని ప్రజలందరి మధ్యా కులమతాలకతీతంగా స్నేహభావం పెరిగిందనుకోండి. అప్పుడు ఇలా బాంబులతోనూ, కత్తులతోనూ చంపుకోవడాలు ఉండవు కదా! దేశంలో రక్తపాతం తగ్గి, శాంతి వాతావరణం నెలకొంటుంది. ఈ విషయాల మీద క్రిందటి వారం మా మహిళామండలిలో చర్చలు జరిగాయి. మేమంతా బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నాం. దాని ప్రకారం ఇకమీదట దీపావళి, రంజాన్, క్రిస్మస్... ఇలా సంవత్సరంలో వచ్చే అన్ని మతాల వారి పండుగలు మా సభ్యులంతా వారి వారి ఇళ్లల్లో జరుపుకోవాలి. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవాలి. అందరితో స్నేహంగా ఉండాలి. అంతేకాదండోయ్ మేము చేస్తున్నట్లే, చుట్టుపక్కల వీలైనంత మందితో చేయించడానికి మా సభ్యులంతా కృషి చేయాలి. ఎవరైతే ఈ కార్యక్రమాన్ని బాగా నిర్వర్తిస్తారో వారికి సంవత్సరం ఆఖరున మంచి బహుమతి ఇస్తారు. మా మహిళామండలిలో సగం కన్నా ఎక్కువ మంది ఉద్యోగస్తులు. కాబట్టి వాళ్లకి బహుమతి అందుకునే ఛాన్సే లేదు. ఎందుకంటే రోజూ పాపం వండుకుని తినడానికే టైమ్ ఉండదు. మన పక్కింటి సీతకి, ఎదురింట్లో వనజామణికి మన పండుగలే ఎలా చేయాలో తెలీదు. ఇంక వేరే మతాల పండుగలు ఎలా చేస్తారు. ఇంక మిగిలారు పంకజం, స్వాతి, అనసూయ. వాళ్లకి పిండివంటలు చెయ్యడం అస్సలురాదు. ఏ శుభకార్యం అయినా 'హోమ్‌ఫుడ్స్'కి పరుగులు పెడతారు. కాబట్టి ఏ వైపునుంచి చూసినా బహుమతి అందుకునే అర్హత నాకే ఉంది. మేము మహిళామండలిలో నిర్ణయం తీసుకున్న తర్వాత మొట్టమొదట వస్తున్న పండుగ క్రిస్మస్. అందుకే మనందరం గ్రాండ్‌గా జరుపుకుందాం. ఏమంటారు? మీరు త్వరగా సామాన్లు తెస్తే వంటల కార్యక్రమం మొదలుపెడతాను. గులాబిపువ్వులు, కోవాలు, నిమ్కీలు, గవ్వలు, కేకులు... ఇలా చాలా రకాలు చేయాలి"

"అంతా బాగానే ఉంది గానీ కాంతం, మనమూ ముగ్గురం మనుషులుంటాము. బబ్లూకి రెండేళ్లు కాబట్టి మనం లెక్కలోకి తీసుకోకూడదు. మిగిలింది మనిద్దరం. మరి ఇంత పెద్దమోతాదులో వంటలు వండాల్సిన అవసరం ఏముంది? మనిద్దరికి సరిపోయేటంత చేసుకుంటే అయిపోతుంది కదా!"

కాంతం కిసుక్కున నవ్వింది. "అయ్యో శ్రీవారూ! అన్ని రకాల వంటలూ వండుకుని మనమే తినేస్తే, నేను క్రిస్మస్ పండుగ చేసినట్లు మా సభ్యులందరికీ ఎలా తెలుస్తుంది? కాబట్టి వారందరికీ నా గొప్పతనం తెలియాలంటే నేను రకరకాల వంటలు వండాలి... అందరికీ పంచాలి. ఇంకొక సంగతి వీధిలోవారికి కూడా పంచాలి. దీనివలన నాకు రెండు ప్రయోజనాలు కలుగుతాయి. మొట్టమొదటిది... సర్వమత సామరస్యం పాటి



స్తున్న ఏకైక సభ్యురాలిగా నా పేరు మారుమ్రోగిపోతుంది... వచ్చే సంవత్సరం మంచి బహుమతి వస్తుంది... ఆ మరుసటి సంవత్సరం నా గురించి 'లయన్స్ క్లబ్' వారికి తెలుస్తుంది. 'ఉత్తమ మహిళ' ఎవార్డ్‌కి వారు నన్నే ఎంపిక చేయొచ్చు. అదే గనుక జరిగితే... వావ్! ఎంత పేరు... ఎంత ప్రతిష్ఠ! చప్పట్లు... మెమెంటో... పుష్పగుచ్ఛాలు... అభినందనలు! అబ్బో! ఆ ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. ఇక రెండవ ప్రయోజనం... నేను వంటలు బాగా చేస్తానన్న సంగతి, మీకు.. కొంతమంది సన్నిహితులకి మాత్రమే తెలుసు. ఇప్పుడైతే మా వంట ప్రతిష్ఠ మొత్తం వీధివీధి తెలిసిపోతుంది. సంఘంలో మంచి గుర్తింపు... హోదా వస్తుంది. అందరూ నన్ను ఆరాధనగా చూస్తారు" ఆ దృశ్యాలన్నీ మనస్సులోనే ఊహించుకుంటూ... తనలో తనే నవ్వేసుకుంటూ తెగ మురిసిపోతోంది కాంతం.

వంటలు వండటం ఏమిటో... బహుమతి రావడం ఏమిటో బుచ్చిబాబుకి ఏమీ అర్థం కావడం లేదు. సగం తెలివి... సగం అపస్మారక స్థితిలో ఉన్న బుచ్చిబాబు నీర్సంగా సోఫాలో కూలబడ్డాడు. అయిదు నిమిషాల తర్వాత తేరుకుని, కాంతం అందించిన సంచుల్ని పట్టుకుని మార్కెట్‌కి బయల్దేరాడు.

* * *

వినాయకచవితి, దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్, జనవరి ఫస్ట్... ఇలా సంవత్సరంలోని ఏ పండు

గనూ వదలకుండా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేస్తున్నది కాంతం. పండుగల పండుగకీ చేసే వంటలు మారుతున్నాయి. కానీ క్వాంటిటీ మాత్రం అస్సలు తగ్గడం లేదు.

మహిళామండలి సభ్యులు, వీధిలోని వారు కాంతం వంటల్ని లొట్టలేసుకుంటూ తింటున్నారు. ప్రస్తుతం కాంతానికి క్షణం తీరిక లేదు. రోజంతా రకరకాల వంటలు చేస్తూ బిజీబిజీగా ఉంది. సాయంగా ఉంటారని ఇద్దరు పనమ్మాయిలని కొత్తగా నియమించుకుంది. ఆ మాటకొస్తే ఆఫీసుకి...ఇంటికి... బజార్లకి తిరుగుతూ బుచ్చిబాబు కూడా మహా బిజీ మనిషి అయిపోయాడు. కాంతానికి రోజులు క్షణాల్లా గడచిపోతున్నాయి. పదిమందిలో తన వంట ద్వారా గుర్తింపు పొందుతున్నందుకు మహా సంతోషంగా ఉంది.

దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది బుచ్చిబాబు పరిస్థితి. ఇంట్లోకి అడుగుపెట్టగానే నేతి ఘుమఘుమలు, పంచదార పాకం సువాసనలు చుట్టుముడుతున్నాయి. ప్రస్తుతం ఆ వాసనలంటే గొప్ప 'ఎలర్జీ'గా ఉంది. అన్నం ముందు కూర్చోగానే, వంటగది నుండి డైనింగ్ రూమ్‌కి తరంగాలుగా తేలుతూ వచ్చే నేతివాసన బుచ్చిబాబు నాసిక ద్వారా కడుపులోకి చేరి నానా హంగామా సృష్టిస్తున్నాయి. దానితో కడుపు తిప్పినట్లవుతోంది. వెంటనే చేతులు కడుక్కుని వెళ్లిపోతున్నాడు. ఆఫీసులో దొరికే కాఫీ, టీలతో కడుపు నింపుకుంటున్నాడు. ఇంచుమించు నెలలో ఇరవై రోజులు ఇదే పరిస్థితి.

బుచ్చిబాబు చిక్కిశల్యం అయిపోతున్నాడు. ఈ ఎనిమిది నెలల్లో ఇరవై కేజీల బరువు తగ్గిపోయాడు. కళ్లు పీక్కుపోయాయి. బూరెల్లాంటి బుగ్గలు కాస్తా గాలితీసిన బెలూన్లలా తయారయ్యాయి. చేతులు, కాళ్లు సన్నంగా పుల్లల్లా అయిపోయాయి. మొత్తంమీద ఒక పేషెంట్‌లా తయారయ్యాడు.


కాంతం చేసి పంచుతున్న పిండివంటలు తింటున్న వారంతా దినదినాభివృద్ధి చెందుతున్నారు. కండపట్టి నవనవలాడుతున్నారు. "అద్భుతం", "ఆహా" "ఓహో" అంటూ లొట్టలేసుకుంటూ తింటూ కాంతాన్ని ఆకాశానికెత్తేస్తున్నారు. "క్రిందటిసారి మీరిచ్చిన అరిసెలు, చక్కిలాలు తిని మా బావగారు, అత్తగారు మిమ్మల్ని ఎంత మెచ్చుకున్నారో చెప్పలేను. వాళ్లు మళ్లీ రెండురోజుల కోసం వచ్చారు" అని చెప్పి కాంతం చేసి ఉంచిన పిండివంటలు పట్టుకుని వెళ్తున్న వనజామణి లాంటివారు కొందరైతే, ఇంటికి వచ్చిన అతిథులను ఏకంగా కాంతం ఇంటికి తీసుకుని వచ్చి దగ్గరుండి తినిపించి తీసుకుని వెళ్లేవారు మరికొంతమంది. నెల రోజుల కోసం తెచ్చుకున్న సామాన్లన్నీ వారం రోజులకే అయిపోతున్నాయి. బుచ్చిబాబు నెలకి ఏభై వేలు జీతం అందుకుంటున్నా ఈ మధ్య అప్పులు చేసే పరిస్థితికి దిగజారిపోయాడు. ఆఫీసులో ఎన్ని లోన్లు పెట్టొచ్చో అన్నీ పెట్టేశాడు. ఈ పరిస్థితిని ఎలా చక్కదిద్దుకోవాలో అర్థంకాక ఎప్పుడూ పరధ్యానంగా ఉంటున్నాడు.

బుచ్చిబాబు పరిస్థితిని చూసి స్నేహితులు...తోటి ఉద్యోగస్తులు కంగారుపడసాగారు. "ఎందుకిలా అయిపోయావ"ని ఎంతమంది ఎన్ని రకాలుగా అడిగినా ఏ జవాబూ చెప్పడం లేదు. ఇంట్లో ఏవైనా సమస్యలు ఉన్నాయేమోనని, కొంతమంది కొలీగ్స్ రహస్యంగా బుచ్చిబాబు ఇంటికి వెళ్లి ఎంక్వైరీ చేశారు. గుండ్రాయిలా అటూ ఇటూ తిరుగుతున్న కాంతంని చూశారు. బాబు హాయిగా ఆడుకుంటున్నాడు. మరెందుకు బుచ్చిబాబు రోజురోజుకీ క్షీణించిపోతున్నాడో అని ఆఫీసులో అందరూ చర్చించుకోవటం మొదలుపెట్టారు. చివరికి అందరూ కలసి ఏకగ్రీవంగా బుచ్చిబాబుకి 'ఎయిడ్స్' జబ్బు వచ్చి ఉంటుంది. అందుకే అలా సన్నంగా అయిపోయాడని నిర్ణయించేశారు.

బుచ్చిబాబుని చూడగానే అందరూ గుసగుసలాడుకోవడం, తప్పించుకుని తిరగడం చేయసాగారు. ఇంట్లో కాంతం వంటల జోరు, ఆఫీసులోని కొలీగ్స్ ప్రవర్తన మరింత కృంగదీయసాగాయి. పిచ్చెక్కినట్లనిపించి కోపంగా జుత్తు పీక్కోవడం మొదలుపెట్టాడు. గుప్పెడు...గుప్పెడు వెంట్రుకలు చేతిలోకి వచ్చేస్తున్నాయి. జుత్తంతా పలుచబడిపోయింది. బుచ్చిబాబు వయస్సు ముప్ఫై అయిదు అని చెబితే "చాల్లే! వేళాకోళం ఆడవారిలా వయస్సుని దాచుకుంటారెందుకు. చూస్తే నలభై అయిదుకు తక్కువలాగ లేవు" అని అనే రకంగా తయారయ్యాడు. ఆఫీసులో అందరూ తనతో అంటీముట్టనట్టుగా ప్రవర్తించడానికి కారణం తెలుసుకోవాలనుకున్నాడు.

ఒకరోజు ప్యూన్‌ని పిలిచి అందరూ తనని చూసి ఎందుకలా గుసగుసలాడుకుంటున్నారని అడిగాడు. వచ్చిన సమాధానం విని ముందు భయంతో ఆపైన కోపంతో ఎగిరిపడ్డాడు.

తనకి...తనకి... ఎయిడ్సా ! అందరూ



## ఐశ్వర్య కోసం...

ఐశ్వర్యారాయ్ నటిస్తున్న 'యాక్షన్ రీప్లే' సినిమా మూడు పాటలు మినహా పూర్తయిందిట. మణిరత్నం 'రావణ్' సినిమా కోసం మరిన్ని రోజులు ఐశ్వర్య కేటాయించాల్సి రావడంతో తన సినిమా మరింత ఆలస్యం అవుతోందని వాపోతున్నాడు దర్శకనిర్మాత విపుల్ షా. ఈ లెక్కన 'యాక్షన్ రీప్లే' వచ్చే సంవత్సరమే విడుదల చేయగలనేమో అనుకుంటున్నాడు కూడా. అంత శ్రద్ధగా ఐశ్వర్య నటిస్తున్న 'రావణ్' ఆమెకి మరెంత పేరు తెస్తుందో!

అలా అనుకుంటున్నారా! 'ఓర్నాయనోయ్! ఇవతల దబ్బూ పోయి, అవతల పరువూ పోయి ఇలా అయిందేమిటి నా పరిస్థితి?' అంటూ కాంతం దగ్గర బావురుమని ఏడ్చాడు.

"ఒసేవ్ కాంతం! ఇప్పుడైనా నీ వంటల ప్రవాహాన్ని ఆపవే. నీవలన నేను బయట తలెత్తుకుని తిరగలేకపోతున్నాను. ఆఫీసులో దర్జాగా, రాజులాగ బ్రతికేవాణ్ని. నీ పుణ్యమా అని ప్యూన్‌కి కూడా లోకువైపోయాను" అనగానే కాంతం జయ్...మని తారాజువ్వలా లేచింది.

"చాల్లెండి సంబడం. వంటలు వండీ...వండీ కష్టపడేది నేను. మధ్యలో తిండి తినక మీరెందుకు ఆరోగ్యం పాడుచేసుకోవడం? మిమ్మల్ని తినొద్దని నేనన్నానా...అయినా ఆడది ఏదైనా సాధిస్తుంటే మీ మగవాళ్లు సహించలేరు. ఆడవాళ్లు మీకు అణిగిమణిగి ఉండాలనుకుంటారు. పాపం... ఈ కాంతం సంగతి మీకు ఇంకా తెలియదు. అనుకున్నది సాధించేంతవరకూ నిద్రపోని ఝాన్సీలక్ష్మీబాయిని. ఒక్కసారి నా పేరు ఊరంతా మారుమ్రోగిపోనీయండి. అప్పుడు నా కార్యక్రమానికి ఫుల్‌స్టాప్ పెడతాను. అంతవరకు ఆగే ప్రసక్తే లేదు. అయ్యోరామా! రేపనలే అట్లతద్ది. పప్పు, బియ్యం నానబెట్టాలి. మీతో వాదించే టైమ్ లేదు" కాంతం రుసరుసలాడుతూ వంటగదిలోకి పరుగులు తీసింది.

వేలువేలు ఖర్చు పెట్టి వంటలు వండి అందరికీ పంచడం ఎలాంటి విజయమో బుచ్చిబాబుకి ఎంత బుర్రబద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. ఆ పరిస్థితిలో బుచ్చిబాబుకి తన స్నేహితుడు సత్యం గుర్తుకొచ్చాడు. ఇంటరు నుంచి బి.టెక్ వరకు కలసి చదువుకున్నారు. ఎమ్.టెక్ 'ఖరగ్‌పూర్ ఐ.ఐ.టి.' నుంచి పూర్తి చేసి ఈమధ్యే విప్రో కంపెనీలో చేరాడు. ఒకటి రెండు సార్లు బుచ్చిబాబుని ఆఫీసులో కలిశాడు. కాంతంని తీసుకుని ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. కాంతం వంటల కార్యక్రమం పుణ్యమా అని ఇంతవరకు వెళ్లడం కుదరలేదు.

'సత్యంకి సలహా అడగాలి. వాడైతే నా సమస్యకి మంచి సలహా ఇస్తాడు' అనుకుంటూ సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు.

* * *

డోర్ బెల్ రింగ్ అవుతుంటే, చుడుతున్న లడ్డూని ప్లేటులో పెట్టి సింకులో చెయ్యి కడుక్కుని వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా సన్నగా, నాజూగ్గా సుమారు పాతికేళ్లు ఉన్న అమ్మాయి నిలబడి ఉంది.

కాంతాన్ని చూడగానే ఆ అమ్మాయి "నా పేరు వనజ. మీ వెనుక వీధిలో ఆకుపచ్చ మేడ ఉంది కదా! అందులోకి కొత్తగా అద్దెకి దిగాము. కాంతం అంటే..."


"నేనే కాంతాన్ని. నాతో ఏమైనా పని ఉందా! రండి లోపలికి.. కూర్చోండి" సోఫా చూపించింది కాంతం.

ఇంటిని ఒకసారి తేరిపారా చూస్తూ "మా పాప అఖిల మొదటి బర్త్‌డే వచ్చేవారంలో ఉంది. ఇంట్లోనే ఫంక్షన్ చేద్దామనుకుంటున్నాం. ఐటమ్స్ అన్నీ ఇంట్లోనే వంటావిడని పెట్టి చేయిద్దామని ప్లాన్ చేనుకున్నాము. లక్కీగా మంచి వంటావిడ దొరికింది. ప్రాబ్లమ్ ఏమిటంటే ఆవిడకి స్వీట్లు, పిండివంటలు చేయడం రాదు. ఈ వీధిలో నలుగురైదుగుర్ని ఎంక్వైరీ చేశాం. మీరు స్వీట్స్ చాలా బాగా చేస్తారని చెప్పారు. అంతేకాదండోయ్. మీరు వాళ్లకిచ్చిన కాజా నాకు తినమని ఇచ్చారు. వెరీ టేస్టీ. బర్త్‌డే పార్టీకి కావల్సిన స్వీట్సన్నీ మీకు ఆర్డరిచ్చి చేయించుకోవాలని అనుకుంటున్నాను. ఆ వివరాలవీ మీతో మాట్లాడాలని వచ్చాను. డబ్బు గురించి మొహమాట పడకండి. మీరు అనుకున్నదాని కంటే ఎక్కువే ఇవ్వడానికి రడీగా ఉన్నాను. నాకు మాత్రం క్వాలిటీ ముఖ్యం"

కాంతం ముఖంలో క్షణక్షణానికీ రకరకాల ఫీలింగ్స్ మారుతున్నాయి. ముందు అయోమయంగా పిచ్చిచూపులు చూసింది. తర్వాత తెల్లబోతూ వెర్రిమొహం వేసింది. క్రమంగా మొహం కోపంతో కందగడ్డలా తయారయింది. ముక్కుపుటాలు అదురుతున్నాయి. వళ్లంతా పెనం మీద పడ్డ ఆవగింజలా కోపంతో ఎగిసిపడుతోంది.

వనజని మింగేసేలా చూస్తూ "ఒక ఆఫీసరుకి భార్యని, ఎం.బి.ఎ. స్టూడెంట్‌ని. నన్ను...నన్ను వంటమనిషిలాగ ట్రీట్ చేస్తావా? ఏదో సరదాగా నేను చేసిన వంటల్ని నలుగురికీ పంచినంత మాత్రాన వంటమనిషిని అయిపోతానా? అసలు నీకెంత ధైర్యం? మా ఇంటికి వచ్చి మరీ ఇలా మాట్లాడడానికి..."

పట్టలేనంత ఆవేశంతో కాంతం వళ్లంతా ఊగిపోతున్నది. వనజ వెటకారంగా నవ్వుతూ "ఇది మరీ బాగుంది. మేము ఇక్కడికి వచ్చి కేవలం పది రోజులయింది. మీరు ఆఫీసరు భార్యో, వంటమనిషో నాకేం తెలుసు?" ఒకసారి చిన్నగా భుజాలెగరేసి, "మీ వీధిలోనే మా ఆడపడుచు ఫ్రెండ్ ఉంది. ఆవిడే ఒకసారి 'మా వీధిలో కాంతం అనే ఆవిడ ఉంది.



## బిపాషాకి బోల్డంత క్రేజ్!

నల్లపిల్ల బిపాషా బసు బ్రిటన్‌కి చెందిన ఓ టీవీ చానెల్ రియాలిటీ షోలో ఒక జడ్జిగా చేయడానికి ఎన్నికైందట. దీని గురించి బిపాషా ఇంకా ఏమీ చెప్పకపోయినా ఇందులో మాత్రం చాలావరకు నిజం వుందని ఆమె సన్నిహితుల ఉవాచ. ఈ ప్రోగ్రామ్ చేయడం ద్వారా అంతర్జాతీయంగా తనకి మంచి పాపులారిటీ వస్తుందని భావిస్తోంది బిపాషా. దీంతోపాటే హిందీలో షారుఖ్ ఖాన్ నిర్మించే ఓ టీవీ షోకి కూడా బిపాషా హోస్ట్‌గా చేయబోతున్నట్టు సమాచారం. మొత్తానికి అటు సినిమాలు, ఇటు టీవీ షోలతో బిపాషా బిజీ బిజీ అన్నమాట.

ఉద్యోగం సద్యోగం లేదు. ఈమధ్య రకరకాల వంటలు చేసి వీధివీధి అంతా పంచుతోంది. ఏమో తొందర్లోనే 'హోమ్ ఫుడ్స్' లాంటిది మొదలుపెడుతుందేమో! వాళ్లాయనకి కూడా ఏదో పెద్ద జబ్బే వచ్చినట్లుంది. గుమ్మడిపండులా ఉండే వాడు మునక్కాడలా తయారయ్యాడు. డాక్టర్లకి, మందులకి చాలా ఖర్చవుతుంది కదా! అందుకే ఈవిడ బిజినెస్ మొదలుపెడుతుందేమో' ఇలా అని ఆవిడొక్కర్తే కాదు. మరో ఇద్దరు ముగ్గురు కూడా అనడం నేను విన్నాను. అందుకే మీ దగ్గరకు వచ్చాను మీరేమో చెయ్యనంటున్నారు. ఒక పని చేయండి. ఈ రోజంతా బాగా ఆలోచించండి. మంచి ఆఫర్. మీరు పిండివంటలు, స్వీట్లు చేసి మాకు ఇవ్వడానికి అంగీకరిస్తే ఈ నెంబరుకి ఫోన్ చేయండి. వస్తాను" వయ్యారంగా నడుచుకుంటూ వెళ్లిపోయింది.


కాంతం గుడ్లప్పగించి చూస్తూండిపోయింది. వనజ ఇచ్చిన షాక్ నుంచి తేరుకోవడానికి అరగంటపైనే పట్టింది.

రోజూ తినిచ్చే వంటకాలన్నీ లొట్టలేసుకుని తింటూ వెనకాతల మాత్రం తన గురించి హేళనగా మాట్లాడుకుంటున్నారా? హమ్మో! హమ్మో! ఎంత మోసం! ఎంత మోసం! తనకి వంటలు వండడం తప్పించి మరేదీ రాదా! ఎంత అసహ్యంగా మాట్లాడుకుంటున్నారు.. అయితే రేప్పొద్దున్న నాకు గానీ బహుమతి వస్తే ఇక అంతా కలసి నన్ను వంటమనిషిగా నిర్ణయించేస్తారేమో! ఎం.బి.ఎ.లో మెరిట్ స్టూడెంట్ని నా తెలివితేటలు... మార్కులు... చూసి అందరూ ఎంత మెచ్చుకునేవారు. అవన్నీ మర్చిపోయి కేవలం నలుగురి కోసం తను ఎంత శ్రమ పడింది? పాపం తన పిచ్చిలో పడి బుచ్చిబాబు ఆరోగ్యం కూడా పాడుచేసింది. తన కారణంగా ఆయన ఆఫీసులో ఎన్ని అవమానాలు ఎదుర్కొంటున్నారో? డబ్బూ పోయి... పరువూ పోయి... తను సాధించుకున్నదేమిటి? లేదు... తను ఇకమీదట తన శక్తిసామర్థ్యాలను వంట కోసం వినియోగించదు. కావాలంటే నలుగురు స్టూడెంట్స్కి ట్యూషన్స్ చెబుతుంది... అలా అనుకోగానే కాంతం మనస్సుకి ఎంతో హాయిగా అనిపించింది.

సంవత్సరం తర్వాత ఈ రోజు హాయిగా ఏ పిండివంటా చెయ్యకుండా మధ్యాహ్నం ప్రశాంతంగా నిద్రపోయింది.

* * *

సాయంత్రం బుచ్చిబాబు ఇంటికి వచ్చాడు. ఇల్లంతా ప్రశాంతంగా ఉంది.



ముఖ్యంగా పిండివంటల సువాసనలకు బదులుగా వెంకటేశ్వరస్వామి పటానికి వేసిన విరజాజుల దండ పరిమళాలు ఆహ్లాదకరంగా బుచ్చిబాబుని చుట్టుముట్టాయి.

ఎప్పుడూ ఆ సమయంలో వంటగదిలో బిజీగా ఉండే కాంతం ఈ రోజు చేతిలో వారపత్రికతో దర్శనం ఇచ్చేసరికి బుచ్చిబాబుకి బోల్డంత ఆశ్చర్యం అనిపించింది.

"కాంతం డియర్! ఈ రోజు స్పెషల్స్ ఏవీ లేవా? ఎల్లుండి ఏదో పండుగ ఉంది కదా!"

చేతిలోని పుస్తకాన్ని విసురుగా టేబుల్ మీదకు విసిరేసి, భర్త వైపు చిరాగ్గా చూస్తూ "ఇక మీదట ఈ కాంతం వంటలు వండుతూ కూర్చోదు. రేపట్నుంచి మన ఎదురింటి ఇద్దరు పిల్లలకి ట్యూషన్స్ చెబుతుంది. ఇంకా వాళ్ల ఫ్రెండ్స్ నలుగురు వస్తారంట. వారికి కూడా కలిపి చెబుతుంది. అనవసరంగా ఇన్ని రోజులూ నా తెలివితేటలు వృధా చేసుకున్నాను" కాస్తంత అసహనంగా అంది.

బుచ్చిబాబుకి భలే ఆనందంగా ఉంది. ఇల్లంతా తిరుగుతూ నాట్యం చేయాలని ఉంది. ఇల్లెక్కి ఆనందంతో కేకలు పెట్టాలని ఉంది. కానీ ప్రస్తుతానికి అదంతా మనస్సులోనే దాచేసి, వీలైనంత అమాయకంగా మొహం పెట్టి, "మరి మీ మహిళామండలి.. సర్వమత సౌభ్రాతృత్వం.. వంటలు..బహుమతి..ఇవన్నీ మర్చిపోయావా కాంతం!"

"చాల్లెండి సంబడం. నేను వంటలు వండి అందరిచేతా తినిపిస్తే ఈ కొట్లాటలూ... చంపుకోవడాలూ తగ్గిపోతాయా? ఏమిటి? మార్పు అనేది ప్రతీ మనిషి హృదయంలోంచి రావాలి. ఏదో మొక్కుబడిగా పండుగలు చేసుకున్నంత మాత్రాన నిజంగా మనుషులు మారిపోతారా ఏమిటి? ఇక మీదట మహిళామండలి లేదూ, వంటావార్పూ లేదు. ఇక నుంచి మీరు కొత్త కాంతాన్ని చూడబోతున్నారు. ఆ వనజకి కూడా నా సత్తా ఏమిటో చూపిస్తాను" ఆవేశంతో అందర్నీ పేరుపేరునా దులిపే కార్యక్రమంలో పడింది కాంతం.

తన భార్యలో మార్పు తేవడానికి 'వనజ' పాత్రని ప్రవేశపెట్టి.. తన సమస్యకి మంచి పరిష్కారాన్ని ఇచ్చిన స్నేహితుడు సత్యానికి మనస్సులోనే కృతజ్ఞతలు తెలిపాడు బుచ్చిబాబు. 'రేపు పెద్ద పార్టీ ఇస్తానురా సత్యం' మనస్సులోనే వాగ్దానం చేసేసుకుని సెల్ అందుకుని ఆనందంతో వీధిలోకి పరుగెట్టాడు బుచ్చిబాబు.

○

## ఛార్మి కోరిక

హాట్ హాట్ భామ ఛార్మి ఈమధ్య కాస్త స్టార్రేస్లో వెనకబడిందనే చెప్పాలి. విడుదలకు సిద్ధమవుతున్న తన సినిమాల్లో ఏ ఒక్కటి కాస్త హిట్టయినా చాలు, మళ్లీ ఆమె కెరీర్లో వేగం పుంజుకుంటుంది కదా! అదలా వుంచితే, ఛార్మికి ఓ కోరిక వుందిట. అదేంటంటే- డబుల్ రోల్ చేయాలని తెగ ఉబలాటంగా వుందిట. ఒకే సినిమాలో ద్విపాత్రాభినయం చేసి జనాల చేత శభాష్ అనిపించుకోవాలని వుంది. మరి అలాంటి డబుల్ ధమాకా ఆఫర్ ఎప్పటికి వస్తుందో కదా- అని ఆశగా ఎదురుచూస్తోందిట.